# సంగ్రహ చర్చ (రూల్ 60-62)

## ఉపోద్ఘాతం

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో శాసనసభకు మూడు రకాల విధులు ఉంటాయి. చట్టనిర్మాణం, ఆర్థిక సంబంధమైన, పరిశీలనా సంబంధమైన విధులు అవి. శాసనసభ చట్టాలను చేస్తుంది. ప్రభుత్వం వివిధ శాఖలకు గ్రాంట్లను మంజూరు చేస్తే, ఆర్థిక సంబంధమైన అదుపును శాసనసభ నిర్వహిస్తుంది. ప్రశ్నలు, వాయిదా ప్రతిపాదనలు, కాలింగ్ అటెన్షన్ ప్రతిపాదనలు, అత్యవసర ప్రజా ప్రాముఖ్యం గల విషయాలపై అర్థగంట చర్చ మున్నగు వాటి ద్వారా శాసనసభ సభ్యులు పరిశీలనా పరమైన విధులను నిర్వహిస్తారు. పరిశీలనాత్మకమైన విధులను నిర్వహించటానికి నియమావళి పెక్కు అవకాశాలను కల్గిస్తోంది. వీటి ద్వారా సభ్యులు సమాచారాన్ని రాబట్టవచ్చు. ప్రభుత్వ యంత్రాంగంలోని లోపాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావటానికి ఇవి ఉపకరిస్తాయి. అత్యవసర ప్రజా ప్రాముఖ్యం గల విషయాలపై సంగ్రహచర్చ ద్వారా సభ్యులు అట్టి విషయాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి, నివారణోపాయాలను కనుగొనటానికి అవకాశం ఉంది.

## చర్చ జరుపుటకు నోటీసు : (రూల్ 60)

అత్యవసర ప్రజా ప్రాముఖ్యం గల విషయాలపై చర్చ జరపదలచిన సభ్యుడు కార్యదర్శికి లిఖితపూర్వకమైన నోటీసును ఇవ్వాలి. సభ్యుడు తాను చర్చ జరపదలచిన ఆ విషయాన్ని స్పష్టంగాను, సంగ్రహంగాను వివరించాలి. ఆ విషయంపై చర్చ జరపవలసిన ఆవశ్యకతను, సంబంధించిన కారణాలను వివరించాలి. ఆ నోటీసును బలపరుస్తూ కనీసం యిద్దరు సభ్యులు ఆ నోటీసుపై సంతకం చేయాలి.

## ఆమోద యోగ్యతను సభాపతి నిర్ణయించుట : (రూల్ 61)

సభాపతి తాను అవసరమని భావించిన యెడల, నోటీసు యిచ్చిన సభ్యుని నుండి, మంత్రి నుండి సమాచారాన్ని రప్పించుకొన్న మీదట, ఆ విషయం అత్యవసరమైనదని ఆయన భావించిన యెడల, ఆ నోటీసును అనుమతిస్తారు. ఆయన సభా నాయకునితో సంప్రదించి ఆ విషయంపై చర్చ జరపాల్సిన తేదీని నిర్ణయిస్తారు. సభాపతి ఆ విషయంపై చర్చ జరిపేందుకు రెండు గంటలకు మించకుండా సమయాన్ని కేటాయిస్తారు. అయితే ఆ విషయంపై చర్చ జరపటానికి అన్యదా అంతకు ముందు ఏదైనా అవకాశం లభించే యెడల సభాపతి ఆ నోటీసును నిరాకరిస్తారు.

## సమయాన్ని కేటాయించటం :

కార్యక్రమ సలహా సమితి ఆ విషయంపై చర్చ నిమిత్తము సమయాన్ని కేటాయిస్తుంది.

## చర్చ జరిపించేందుకు విషయాన్ని ఉత్పన్నం చేసే విధానం:

అత్యవసర ప్రజాప్రాముఖ్యం గల విషయాలపై చర్చ జరిపే నిమిత్తం సభ్యుడు యిచ్చిన నోటీసును అనుమతించిన మీదట ఆ విషయాన్ని చర్చింప దలచిన తేదీ కార్యక్రమ పట్టికలో చేర్చుతారు. ఆ విషయం ఏ సభ్యుని పేరున ఉందో ఆ సభ్యుడు సంగ్రహంగా విషయాన్ని వివరిస్తారు. మంత్రి దానికి క్లుప్తంగా సమాధానం యిస్తాడు. ఏ సభ్యుడైనా సభాపతి అనుమతితో చర్చలో పాల్గొనవచ్చు. చర్చపై ఓటింగ్ ఉండదు.



6

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

## సంగ్రహ చర్చ




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.